అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ సంతోష్

గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేవిధంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మండలం వేపూర్‌లో అధికారులు నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను జనవరి 26 నుంచి అమలుకానున్నాయన్నారు. వ్యవసాయ భూములకు రైతు భరోసా అందించడంతో పాటుగా 100శాతం రేషన్ కార్డులను అందించడమే లక్ష్యమన్నారు. రేషన్‌కార్డుల కోసం గ్రామాల్లో సర్వే నిర్వహించి గతంలో మీసేవాలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామసభ విజయవంతంగా నిర్వహించడం పట్ల అధికారులను అభినందించారు. అదేవిధంగా మండలంలోని తర్నికల్‌తండా, తోటపల్లి, తాండ్ర గ్రామాల్లో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, తాసీల్దార్ ఇబ్రహీం, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న కాలనీ వాసులు

నాగర్‌కర్నూల్, జనవరి 24 : కాలనీ అభివృద్ధికోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు ఘనంగా స్వాగతించారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ డ్రైనేజీ, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కౌన్సిలర్, కాలనీ ప్రజలు అడిగిన అంగన్‌వాడీ కేంద్రం, నీటి ట్యాంక్, పల్లె దవాఖానకు భవనం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కాలనీ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని, కౌన్సిలర్ జక్కా రాజ్‌కుమార్‌రెడ్డిలను కాలనీవాసులు శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించిన వేడుకలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రులు పెద్దలను గౌరవించడం నేర్పితే ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కౌన్సిలర్లు తీగల సునీంద్ర, బచ్చన్నయాదవ్, కావలి శ్రీను, లలిత, నిజామ్, పద్మమ్మ, కోఅప్షన్ సభ్యుడు సంపత్, వార్డు ప్రజలు, అదనపు కలెక్టర్ దేవసహాయం, సంక్షేమాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి

జ్యోతినాయక్‌తండాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, జనవరి 24 : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల క్లాస్‌మేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా పూర్వ విద్యార్థి విజయ్‌కుమార్ డీఎస్పీ నుంచి ఎస్పీగా ప్రమోషన్ పొందినందుకు ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలను తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో గ్రామసభలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పదర మండలంలోని జ్యోతినాయక్ తండాలో ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బాలకిషన్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరిస్తున్న ప్రభుత్వాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

చారకొండ, జనవరి 24: ఎన్నికల హామీలు అమలు చేయడంలో రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు ఒకే వైఖరి అనుసరిస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టులే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆపార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్యాచరణ రూపొందించుకొని ఇచ్చిన హామీలు అమలు కోసం దశల వారీగా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా కార్యదర్శి పరశురాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, నాయకులు మద్దినారాయణరెడ్డి, శంకరయ్య, కృష్ణయ్య, బాలయ్య, శ్రీను, అశోక్, మల్లయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉండాలి

చారకొండ, జనవరి 24: ఆర్యవైశ్యులు సంఘటితంగా ఉంటూ హక్కులు సాధించుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల మండల సమావేశం నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పాండు, కోశాధికారిగా చంద్రయ్య, పట్టణాధ్యక్షుడిగా పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, కోశాధికారిగా అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, కార్యదర్శి శ్రీధర్, వంగూరు మండలాధ్యక్షుడు సురేశ్, నాయకులు ఆంజనేయులు, రవి, శ్యాంసుందర్, నర్సింహ, రాజు, కుమారస్వామి, శ్రీనివాస్, కరుణాకర్, సంతోష్, రవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

అడ్డగింతలు, తోపులాటల మధ్య

ముగిసిన గ్రామసభలు

- ప్రజా పాలన జాబితా రద్దు చేయాలని డిమాండ్
- ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం నిలదీత
- లబ్ధిదారుల ఎంపికలపై పలు చోట్ల ఘర్షణలు
- ఫైనల్ కాదు అంటూ దాటవేసిన అధికారులు

వంగూరు : కోనాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నేత రాజేందర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 24 : అడ్డగింతలు, నిరసనలు, బహిష్కరణల మధ్య నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామసభలు శుక్రవారం ముగిశాయి. ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నాలుగు రోజులపాటు నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. జనవరి 26వ తేదీ నుంచి అమలు పరిచేందుకు రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల పంపిణీకి అర్హులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించింది. గ్రామాల్లో నాలుగు రోజులపాటు గ్రామసభలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోయింది. సభల్లో అర్హుల జాబితా ప్రదర్శించడంతో చాలా గ్రామాల్లో అనర్హుల పేర్లు చదవడంతో అర్హులైన లబ్ధిదారులు మండిపడ్డారు. అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకుండా హైదరాబాద్‌లో ఉంటున్న వారు, గ్రామాల్లో లేని వారు, మంచి భవంతులు ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డుల మంజూరు జాబితాలో ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామసభల్లో అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాను చూసిన అధికార పార్టీ నాయకుల్లో సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తూ అసహనానికి గురైనట్లు తెలుస్తోంది. ఈనెల 26 నుంచి అమలయ్యే నాలుగు పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందుతే తప్పా ఎలాంటి పొరపాట్లు జరిగినా గ్రామాల్లో మున్ముందు ఎన్ని ఘర్షణలు జరుగుతాయో వేచి చూడాల్సి ఉంది. రైతు రుణమాఫీ ఇంకా చాలా మందికి రాలేదని అదేవిధంగా భూమి ఉన్న వారి పేర్లను ఆత్మీయ భరోసాలో ఎలా చేర్చారంటూ నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధ కొనసాగింది. పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేని ఒకరు, సంవత్సరం దాటి పోయిన రైతు భరోసా ఇవ్వలేకపోయారంటూ మరొకరు గొడవ చేసుకోగా పోలీసులు కలుగజేసుకొని ఇరు పార్టీల కార్యకర్తలను శాంతపర్చారు. పెద్దముద్దునూర్ గ్రామసభను ఎస్పీ సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీడీవో కోటేశ్వర్‌రావు, డిప్యూటీ ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా గ్రామ సభలు

వెల్దండ జనవరి 24 : మండల కేంద్రంతో పెద్దాపూర్, చెర్కూర్, కంటోనిపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు గందరగోళంగా ముగిసాయి. గ్రామ సభలు ఎందుకు పెట్టారో అర్థం కావడంలేదని పలువురు అభిప్రాయ పడ్డారు. వెల్దండలో ప్రజాపాలనలో భాగంగా ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల జాబిత తప్పుల తడకా అని, వాటిని రద్దు చేసి గ్రామ సభలోనే ఎంపిక చేయాలని పలువురు లబ్ధిదారులు అధికారులను నిలదీయగా, కంటోనిపల్లి గ్రామంలో రేషన్‌కార్డులు కొంత మందికే వస్తే మిగతావారు ఏమి చేయాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో తాసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, శ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లిలో..

పెంట్లవెల్లి, జనవరి 24 : మండలంలోని జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాల్లో శుక్రవారం అధికారులు గ్రామ సభలను నిర్వహించారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ పోలీసుల పర్యవేక్షణలో జరిగింది. ఆత్మీయ భరోసా కింద ఎంపిక చేసిన వారి పేర్లను చదవుతుండగా తమ ఇష్టాను సారంగా పూర్తి పేరు లేకుండా లబ్ధిదారుల పేర్లు చదవడం ఏమిటని గ్రామస్తులతోపాటు స్థానిక నాయకులు ప్రసాద్, భరత్‌చంద్ర అధికారులను నిలదీశారు. ప్రజలను మోసగించాలని ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు సురేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ భాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవెందర్, ఏపీవో మోహన్‌కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జనవరి 24: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం జరిగిన గ్రామ సభల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ అమలుపై ప్రజల నుంచి అధికారులపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. దీంతో గ్రామ సభలకు హాజరైన అధికారులు ప్రభుత్వ ఆరు గ్యారెంటీలపై మాట్లాడకుండా సంక్షేమ పథకాలపై తూతూ మంత్రంగా గ్రామ సభలను నిర్వహించారు.

అనర్హులకు సంక్షేమ పథకాలా..

వంగూరు, జనవరి 24 : పేదలకు కాకుండా అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తారా.. ఇదేనా ప్రజా ప్రభుత్వమంటూ బీఆర్ఎస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి గ్రామసభలో అధికారులను నిలదీశారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి, గాజర, ఉమ్మాపూర్, కోనాపూర్, ఉల్పర, వెంకటాపూర్, పోతారెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. కోనాపూర్ గ్రామసభలో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర పథకాలు మంజూరు కావడంతో రాజేందర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంజూరైన వారికి తిరిగి సర్వే చేపట్టి పార్టీలకతీతంగా అసలైన పేదలకు పథకాలు అందేలా చూడాలన్నారు. దీంతో అధికారులు స్పందించి తిరిగి విచారణ చేపట్టి అర్హులను గుర్తిస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఉమ్మాపూర్‌లో లిస్టు చదువుతుండగా అర్హుల పేర్లు రాకపోవడంతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో విజయ భాస్కర్ పాల్గొన్నారు.

వెల్దండ గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు


పెంట్లవెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

పెద్దకొత్తపల్లి : సభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, జనవరి 24 : ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేకుండా గ్రామ సభల ద్వారా ప్రజల సమక్షంలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని వెల్దండ, చెర్కూర్ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఇదివరకు ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా జాబితా తప్పుల తడకగా ఉందని వెంటనే నిజ వైఖ లబ్ధిదారులను గురించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు యాదగిరి, శేఖర్, శ్రీను, మాజీ ఎంపీటీసీ బీమయ్య గౌడ్ మాజీ ఉపసర్పంచ్ నర్సింహ, లాలయ్య పాల్గొన్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణం దగ్ధం

దగ్ధమైన వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణం

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ నేషనల్ థియేటర్ వెనుక భాగంలోని సిరి వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణం గురువారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి దుకాణం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు, స్థానికుల కథనం మేరకు కల్వకుర్తి పట్టణానికి చెందిన కుకుడాల మల్లేశ్ సిరి వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి 10 గంటలకు దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగి దట్టంగా పొగలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు పోలీసులకు, దుకాణదారుడికి సమాచారం ఇవ్వగా ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చే సరికి దుకాణంలో ఉన్న సామగ్రి మొత్తం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. కాలిపోయిన సామగ్రి విలువ దాదాపుగా రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

మైలారం మైనింగ్ పనులను ఆపాలి

బిజ్నూర్, జనవరి 24 : మైలారం గ్రామంలో చేపడుతున్న మైనింగ్ పనులను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే తప్పుడు ధృవీకరణ పత్రాలు పెట్టి అనుమతులు తీసుకొని మైనింగ్ తవ్వకాలు చేపట్టడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని మైనింగ్ పనులను ఆపే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దేశ్యనాయక్, మండల కార్యదర్శి శంకర్‌నాయక్, సభ్యులు సత్యం గౌడ్ రమేశ్‌గౌడ్, నవనీత్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

కష్టపడే గుణం ఉండాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 24 : ఏ పని చేసిన నిబద్ధతతో కష్టపడే గుణం ఉండాలని సెక్రెటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సబితా అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాను సారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థ ఉయ్యాలవాడలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. సమాజంలో భ్రూణ హత్యలు తల్లి గర్భంలో ఉన్నప్పుడే జరుగుతున్నాయని, భ్రూణ హత్యలను అరికట్టడానికి ప్రభుత్వం లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా చట్టం తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుసూదన్‌రావు, ఎస్సార్ సత్యనారాయణ, శ్యాంప్రసాద్‌రావు, రామచందర్, ప్రిన్సిపాల్ లలితాకుమారి ఉన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

తిమ్మాజిపేట, జనవరి 24 : మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మెనేజర్ రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో మారేపల్లి గ్రామంలో మహిళా సంఘం సభ్యురాలు శివరంజనికి గ్రామీణ పేదరిక సంస్థ, ఆవంచ గ్రామీణ బ్యాంక్ ఆర్థిక సహకారంతో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన కందిపప్పు తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

కార్యక్రమంలో మెనేజర్ సునీల్‌కుమార్, ఏపీఎం శ్రీహరి, ఫీల్డ్‌అధికారి ఆశోక్ యాదవ్, సీసీ యాదమ్మ, హైమావతి, నాగమ్మ, లక్ష్మి ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పరిశీలన

గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, జనవరి 24 : ఈనెల 26వ తేదీన పట్టణంలోని పోలీస్ పరేడ్‌లో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టు ఎంపికైన బాలికకు సన్మానం

శిరీషను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

తిమ్మాజిపేట, జనవరి 24 : ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికను అదనపు కలెక్టర్ దేవసహాయం శుక్రవారం సన్మానించారు. తిమ్మాజిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శిరీష పాఠశాల క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి, రాష్ట్ర జట్టుకు ఎంపికై అక్కడ మొదటి బహుమతి సాధించడంలో కీలకపాత్ర పోషించిన శిరీక్ష ను బాలికా దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సన్మానించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేశ్, తిమ్మాజిపేట ఎంఈవో సత్యనారాయణశెట్టి, పీడీ అరుణ పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

- కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు

పూలమొక్కలను అందజేస్తున్న డీఎం

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణీకులను తమతమ గమ్యస్థానాలకు చేరవేయడంలో చాలా కీలకమైన పాత్రను పోషిస్తారని వారిని క్షేమంగా చేరవేయాల్సిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉందని కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఎంవీఐ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు డ్రైవర్లకు గులాబీపూలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎం సుభాషిణి, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించగలుగుతామని కల్వకుర్తి సీఐ నాగార్జున అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ, మానవత ఫౌండేషన్, మీటీవీల సంయుక్త ఆధ్వర్యంలో తాలూకా స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి గణతంత్ర దినోత్సవం రోజున పోలీస్‌స్టేషన్‌లో బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంరెడ్డి, వైద్యులు రంజిత్, రమ్య, సందీప్, సదానందం, రాజేందర్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

దోమలపెంట, జనవరి 24 : ఎంపీ మల్లురవి శ్రీశైలం పర్యటనలో భాగంగా మార్గమధ్యలో ఈగలపెంట జెన్కో క్రిష్ణవేణి గెస్ట్ హౌస్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. అనంతరం గ్రామ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మల్లికార్జున రావు, రసూల్, పార్థసారథి ఉన్నారు.

కాంగ్రెస్ బూటకపు మాటలను నమ్మొద్దు

దోమలపెంట, జనవరి 24 : కాంగ్రెస్ బూటకపు మాటలను నమ్మొద్దని దోమలపెంట బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు ఎడ్ల శేఖర్ యాదవ్, ఎంపీటీసీ తిమ్మన్న, మహేశ్ శుక్రవారం ఆరోపించారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు చీదరిస్తారోనని అర్థమై కొత్త డ్రామాలకు ప్రభుత్వం తెరతీందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 24 : జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో జనవరి 27వ తేదీన సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల నోడల్ అధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఫాక్స్‌కాన్ కంపెనీ, కొంగరకలాన్ కంపెనీ హైదరాబాద్ వారు ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వెయ్యి మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా మేళా నిర్వహించనున్నట్లు, ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగులు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9848289763, 9966386684 నెంబర్లను సంప్